207

# గాజుపెంకులు

ఒక మహానగరంలో శ్రీమంతులు నివసించే ఒక ఖరీదైన పేటలో చుక్కలలో శుక్రుడిలా వైభవోపేతంగా కనబడుతున్న ఒక అందాలమేడ. ఆ మేడచుట్టూ పదెకరాల విస్తీర్ణంగల జాగాలో నిమ్మ, దానిమ్మ, జామ, మామిడి, ద్రాక్ష మొదలైన ఫలవృక్షాలు, సన్నజాజి, విరజాజి, మల్లె, మొల్ల, మొగలి, సంపెంగ, మాలతి, మాధవి, మందార మొదలైన దేశవాళీ పూలమొక్కలు, ఫెరన్సు, క్రోటన్సు మొదలైన మొక్కలు వందలసంఖ్యలో ఉన్నాయ్.

చుట్టూ దట్టంగా పెరిగిన ఫల పుష్ప వృక్షాలమధ్య నున్న విదేశీ నమూనాలోని ఆ మేడ దూరంనుంచి చూసే వారికి ఫారెస్టు డిపార్టుమెంటుకు చెందిన ప్రధాన కార్యాలయంగా కనిపిస్తుంది. ఆ యింటి ముందరగేటు దాటి ఇంటిలోకి ప్రవేశించేవారు ఒక కీకారణ్యం మధ్యగల సన్నని కాలి

బాటమీద ప్రయాణం చేస్తున్నట్లు పిలవక మానరు. ముఖ్యంగా కొత్తగా ఆ యింటికి వచ్చినవారికి గుబురుగా పెరిగిన ఆ చెట్ల మధ్యనుండి ఏ పురుగూ పుట్రా వచ్చి కాటు వేస్తాయేమోనని గుండెలు పీచు పీచు మంటూ ఉంటయ్.

అన్నిటికన్న ఆ యింటి ప్రత్యేకత దానిచుట్టూ ఉన్న ఎత్తయిన ప్రహారీగోడ. ఆ గోడమీంద ప్రక్కలన ఎన్నో గాజు పెంకులు దిగబడి ఉన్నయ్. ఆ యిల్లు మెయిన్ రోడ్డు పక్కనే ఉండటంవల్ల వచ్చిపోయే వారందరి దృష్టులూ యథాలాపంగానైనా ఆ యింటిమీదకు ప్రసరించక మానవు.

ఐతే వారి దృష్టులకు దూరంగా కనబడుతున్న ఆ మేడ తాలూకు సౌందర్యం. ప్రహారీగోడకన్న ఎత్తుగా పెరిగిన చెట్ల తాలూకు ఫల పుష్పాల అందంకన్న ప్రహారీగోడకున్న గాజు పెంకుల కర్కశత్వమే ప్రధానంగా ఆకర్షిస్తుంది.

ఏదుపంది ముళ్ళలా ఆ గోడలోనుండి పొడుచుకు వచ్చిన గాజుపెంకులు వికృతంగా, భయంకరంగా కనపడతయ్- వాళ్ళ కలా కనపడాలనే ఆ యింటి యజమాని ఉద్దేశం కూడా.

రోజూ తీరిక సిక్కినప్పుడల్లా ఆ యింటిముందరి వరండాలో నిలబడి వాడిగా, వంకరటింకరగా, కళ్ళకు చురుకు చురుకు మనిపించేలా కనబడుతున్న గోడమీద గాజుపెంకులను చూసి కొండంత ధైర్యాన్ని పుంజుకుంటూ ఉంటాడు ఆ యింటి యజమాని సింహాచలం.

నగరంలోని పది క్లబ్బులలో తనకున్న పరపతినీ, ఇర్వై బ్యాంకులలో బంధుమిత్రులందరి పేరా నిలవచేసిన ఆస్తినీ, యివిగాక ఇంట్లోని పడకగదిలో భూగర్భంలో దాగిఉన్న నల్లడబ్బునీ అన్నిటినీ కాపాడుకోవటానికి ఆ గాజుపెంకులు చాలా అవసరమని సింహాచలం ఉద్దేశ్యం.

'అంగాజన' మనబడే తన క్రింది తరగతి మనుష్యులను తననుండి వేరుచేసే ఆ గాజుపెంకులను చూసినప్పుడల్లా తాను సురక్షితంగా ఉన్నానన్న భావాన్ని పదేపదే గుర్తుకు తెచ్చుకుంటూ ఉంటాడు సింహాచలం.

సింహాచలానికి దైవభీతికూడా మెండుగానే ఉంది. ఏడాదికొకసారి నల్లడబ్బులోనుండి ఒక లక్షరూపాయలను తీసి వెంకన్న హుండీలో మూడో కంటికి తెలియకుండా వేసి వస్తుంటాడు. ఐనా చాలామంది భక్తులవలె పొద్దున్నే లేవగానే దేవుడి ముఖం చూడటానికి బదులు సింహాచలం తన యింటి చుట్టూ ఉన్న గాజుపెంకులనే చూస్తుంటాడు. ఉదయం పక్కమీాదనుండి లేవగానే యింటిచుట్టూ ఓసారి ప్రదక్షిణం చేసి గోడమీాద గాజుపెంకులన్నీ సురక్షితంగా ఉన్నాయా లేక ఏ రాలు యున్నా రాళ్ళతో, యితర ఆయుధాలతో పగలగొట్టి పెకలించేడా అని ఎంతో ఆత్రంగా పరిశీలిస్తాడు. ఆ గాజుపెంకులు యథాస్థానంలో చెక్కు చెదరక ఉన్నాయని గ్రహించేక తృప్తిగా నిట్టూర్చి లోపలికి వెళ్ళి తన పనులు చూసుకుంటాడు.

తన ఐశ్వర్యాన్నీ, అంతస్తునీ చూసి ఓర్వలేని 'అంగా జనం' ఏ క్షణంలో తన ఇంట్లోకి జొరబడి తన సొమ్ములను అపహరిస్తారోనని సింహాచలానికి రాత్రింబవళ్ళు ఒకటే గుండెలో గుబులు.

అందుకే వీధిగేటుకన్న గుమ్మడికాయంత తాళాన్ని. గోడమీది గాజుపెంకులను తన ఆప్తబంధువులు ఎంతో అంత అప్యాయంగా చూసుకుంటూ ఉంటాడు. అసలు జైళ్ళలో లాగా తన గోడనంతటినీ ఎలక్ట్రిఫై చేయించేద్దామా అనుకున్నా డొకసారి సింహాచలం. కాని మేకలను చంపటానికి పిస్తోలు నుపయోగించుట యెందుకు? ఒక చిన్న కత్తి చాలదా అనుకుని గాజుపెంకులతోనే సరిపుచ్చుకున్నాడు.

అసలు సింహాచలం యింటిచుట్టూ అన్ని చెట్లను అడవిలా పెంచడానికి కారణం అతనిలోని సౌందర్య పిపాసికాదు. కనీసం వ్యాపారదృష్టికూడా కాదు. ఆ మాటకి వస్తే అతని పెరట్లోని పళ్ళను వాకిట్లోని పూలను అన్నిటినీ అమ్మగా వచ్చిన డబ్బు క్లబ్బులో స్నేహితులకు ఒకరోజు 'ఖుషీ' చెయ్యటానికి కూడా చాలదు.

సంపెంగలు మొగలిపొదలు, నైట్‌క్వీనులు ఘుమ ఘుమ మంటూ వెదజల్లే సువాసనలకు మేలుజాతి సర్పాలు ఆ పొదలో నివాస మేర్పరచుకుంటాయని వినికిడి. ఒకవేళ ఏ దొంగచాటుగానో గేటుదాటి ప్రవేశించినా దొంగలు ఆ

చెట్లను చెట్లలోని పాములను చూసి ఝుడుసుకుని పారిపోతారని సింహాచలం ధైర్యం.

ఐతే ఆ పాములంటే సింహాచలానికి భయంలేదా అన్న సందేహం కొందరికి రావచ్చు. పెరటి-చెట్టు వైద్యానికి పనికిరాదని కొందరు నమ్మినట్లే యింట్లోని పాములు యింటివారిని కరవవని సింహాచలం గట్టిగా నమ్ముతాడు.

గాజుపెంకులతో నిండిన గోడ ఆవరణలోపల తన సమీపంలో ఉన్న విష నాగులకు జంకని సింహాచలం ఆ గోడ బయటనున్న మామూలు మనుషులకు ఎందుకంత భయపడతాడా అనుకోవచ్చు కొందరు. అతనికి ప్రాణంమీద కన్న డబ్బుమీదనే ప్రీతి యెక్కువ అని అతని ధోరణినిబట్టి మనం అర్థంచేసుకోవాలి.

శ్రీమంతులందరి యిళ్ళలో లాగానే సింహాచలం యింట్లోకూడా సింహంలాటి ఒక సీమకుక్క ఉంది. కొత్తవాళ్ళెవరైనా వచ్చారంటే కండలూడి వచ్చేలా కరుస్తుంది. కాని యిటీవలనే అది మరణించింది. దాని స్థానంలో దానంత సమర్థవంతమైన కుక్కని తీసుకురమ్మని నౌకరుతో చెప్పాడు సింహాచలం.

ఓరోజు మధ్యాహ్నం సింహాచలం పనిమీద పక్క ఊరికి బయల్దేరాడు. వెళ్ళేముందు ఎంత డబ్బిచ్చి ఐనా సరే కుక్కని తెప్పించమని భార్యతో చెప్పేడు. మధ్యాహ్నపు ఎండలో తళతళ మెరుస్తున్న గోడమీది గాజుపెంకులను

చూసి తృప్తిపడ్డాడు. అర్ధాంగికి కూడా తెలియకుండా కొన్ని రహస్య ప్రదేశాలలో దాచిఉంచిన డబ్బును తడిమి చూసుకున్నాడు. తాను తిరిగివచ్చేవరకు తన ఆస్థి అంతా సురక్షితంగా ఉంటున్న ధైర్యాన్ని మరల మరల తెచ్చుకుని బయలుదేరాడు సింహాచలం.

ఊరినుండి మూడురోజులలో తిరిగి వద్దామనుకున్న సింహాచలం పని వత్తిడివల్ల వారంరోజులవరకు రాలేక పోయేడు. ఈ వారం రోజులలోను సింహాచలం యింట్లో అతనికి తెలియని, అత నూహించని మార్పులు చాలా జరిగినయ్. ఆ మాటకి వస్తే సింహాచలం ఊళ్లో లేనప్పుడల్లా అలాటి మార్పులు ఎప్పుడూ జరుగుతూనే ఉంటయ్. సింహాచలంకి వయసొచ్చిన కొడుకులు, కూతుళ్ళు అంతా కలసి అరడజనుమంది ఉన్నారు. ఆస్థిని పెంచటానికి పడేశ్రమ శ్రద్ధలలో కనీసం నూరోవంతయినా పిల్లల పెంపకంలో సింహాచలం చూపలేదు. వాళ్ళ చదువు సంధ్యలనుగురించిగాని, శీల సంస్కారాలనిగురించిగాని ఆలోచించటానికి అట్టే వ్యవధి ఉండేది కాదతనికి. వాళ్ళ పెళ్ళిళ్ళనుగురించిన ఆలోచన ఉన్నా తన హోదాకి సరిపడే సంబంధాలను తేవాలన్న కోరికతో ఆ ఆలోచనను తర్వగా క్రియారూపంలో పెట్టలేక పోయాడు. అగ్నికి గాలి తోడైనట్లు బాధ్యతారహితమైన పెంపకంలో పెరిగిన సింహాచల పిల్లలకు చేతినిండా డబ్బు కూడా ఉండటంవల్ల తండ్రి పరపతిని అడ్డం పెట్టుకుని అడ్డమైన

తిరుగుళ్ళకూ అలవాటుపడ్డారు. ముఖ్యంగా తండ్రి ఊళ్ళో లేనట్లయితే యింటికి రాత్రిళ్లు ఆలస్యంగా రావటమో అసలు రాకుండా ఏ స్నేహితులఇళ్ళలోనో, క్లబ్బులలోనో గడపటం వారి కలవాటు. కాని పాపం సింహాచలానికి యీ సంగతులన్నీ తెలియవు. సింహాచలం ఊరినుండి తిరిగివచ్చిన రాత్రికూడా అతని పిల్లలు మామూలుప్రకారం యింట్లో లేరు. తండ్రి పదింటిదాకా రాకపోవటం చూసి ఆపై యేం వస్తాడులే అన్న ధైర్యంతో బయటకు పోయేరు.

సింహాచలం యిల్లు చేరుకునేసరికి రాత్రి పన్నెండు కావస్తోంది. అతని భార్య ఎక్కడో గదిలో ఒక్కతీ పడుకుని నిద్రపోతోంది. యజమాని యింట్లో లేకపోవటంవల్ల నౌకర్లు కూడా మత్తుగా తాగి ఔట్‌హౌస్‌లో ఒళ్ళు మరచి నిద్రపోతున్నారు. అర్థరాత్రిపూట యింటికి రావటం సింహాచలానికి కొత్తేంకాదు. అందువల్ల తన దగ్గరున్న డూప్లికేట్ తాళం చెవితో గేటు తాళం తీసి లోపలికి ప్రవేశించాడు. అతను కాలు లోపలికి పెట్టిన మరుక్షణమే సీమ కుక్క సింహంలా వచ్చి అతనిమీది కురికింది. తను ఊళ్ళోలేని సమయం యింట్లో జరిగేమార్పు అన్నిటిలానే కొత్త పెంపుడు కుక్క కూడా వచ్చిందన్న సంగతి సింహాచలానికి తెలియనందున ఎదురుచూడని ఆ సంఘటనకి నిరుత్తరుడైనాడు. నోరు తెరచి నౌకర్లను పిలుద్దామని అనుకుంటూండగానే ఆ కుక్క సింహాచలం చొక్కాను, పంచను

చింపెయ్యటం జరిగింది. వెనక్కి పోలేక ముందడుగు వెయ్య లేక పక్కనే ఉన్న గోడమీద చెయ్యివేసేడు సింహాచలం. కుక్క మొరుగుతూనే ఉంది— అంతకన్న బలవంతంగా అతని కాలిపిక్కను పట్టుకుంది. ఆ కుక్క కాటుకన్న ఆ అర్ధరాత్రి చీకట్లో తన నిస్సహాయతకి కలిగిన జంకే అతనిని ఎక్కువగా క్రుంగదీసింది. ఎలాగో ఓపిక తెచ్చుకుని ఓ పక్క కుక్క కరుస్తున్నా గోడమీద చేతులువేసి, ఆ ఆసరాతో గోడ నెక్కాడు సించహాలం వెంటనే రెండు చేతులలోను గాజు పెంకులు దిగబడినయ్. బాధగా మూలిగాడు సింహాచలం. ఆ గాజుపెంకులే లేకపోతే గోడదాటి బయటకు పరుగెత్తి ప్రాణాలను రక్షించుకోవటం అతని కేమంత కష్టంకాదు. కాని యిప్పుడా గాజుపెంకులే అతనికి ప్రాణసంకటంగా ఉన్నయ్.

అప్పటికే కాలును చాలా గట్టిగా కొరకేసింది కుక్క. ఆ బాధకి ఓర్చుకోలేక ప్రాణాలన్నీ బిగపెట్టి గోడమీదకు ఎగిరేడు సింహాచలం. తన ఆస్థినీ, తన సరస్వాన్నీ కాపాడుతా యనుకున్న గాజుపెంకులు అతని ఛాతీలో చేతులలో గుచ్చుకుని హింస పెట్టినయ్.

తనచుట్టూ ఉన్న సమాజానకీ, అందులోని సామాన్య ప్రజలకీ దూరంగా ఉండి, తనకీ వారికీ మధ్య అత్యాశ, అహంకారం, స్వార్థం, సంకుచితత్వం అనబడే గాజుపెంకులను పరచుకుని వాటి వెనక సురక్షితంగా ఉండవచ్చునని భ్రమపడిన సింహాచలం ఆ గాజుపెంకులకే ఆహుతై పోయాడు.